# ఎనిమిదో కథ

– దాసరి అమరేంద్ర

‘యజ్ఞం’ కథ రాసి యాభై ఏళ్ళయింది. అచ్చుపడి నలభై ఎనిమిది. అచ్చుపడ్డప్పట్నించి ఈ కథ మీద చర్చ జరుగుతూనే వుంది. వందలాది పుటలు నిండాయి. ఇంకా నిండుతున్నాయి. అందులో కొన్ని పుస్తకాలుగా వచ్చాయి. ‘యజ్ఞం తరవాత ...’ అంటూ కథలూ వచ్చాయి. అడపా దడపా ఆయా వ్యాసాలు చదివాను. చర్చలు విన్నాను. ఆ కథ గురించి తాత్వికస్థాయిలో చేసిన విశ్లేషణలూ కొన్ని చదివాను. ఆ కథ చెప్పని ‘గొప్ప విషయాలు’ ఆయా వ్యాసాల్లో వుండటం గమనించాను. హనుమంతుడ్ని దర్జీ టేపుతో కొలిచే ప్రయత్నం చేసిన వుద్దండులను చూసి విస్మయమూ చెందాను.

‘యజ్ఞం’ గురించి రాయాలనుకున్నప్పుడు ఆయా వ్యాసాలు, ఆ పుస్తకం, ఆ సీక్వెల్ కథలూ ఓసారి చదువుదామనిపించింది. కానీ నేను నమ్మింది చెప్పడానికి వాటిని చదవడం అవరోధమవుతుందేమోనని అనిపించింది. విరమించాను.

నిజానికి ఇది విమర్శా – విశ్లేషణా కాదు. సమీక్ష కూడా కాదు. అప్పటి మైలురాయిని అందరికీ – ముఖ్యంగా ఈ తరం పాఠకులకు, రచయితలకు – వీలైనంత సమగ్రంగా పరిచయం చెయ్యడం ఈ వ్యాసం వుద్దేశ్యం. ఆ తరం వారికి మరోసారి మరోసారి గుర్తు చెయ్యడం మరో వుద్దేశ్యం.

*

సముద్రానికి అయిదు మైళ్ళు ఎడంగా, జి.టి. రోడ్డుకు ఆరు మైళ్ళ దూరాన, శ్రీకాకుళానికి కాకిమార్గాన పదిహేను మైళ్ళలో వున్న గ్రామం ‘సుందర’పాలెం. తాటితోపుల సుందర దృశ్యాలు, చిక్కని కొబ్బరిచెట్లు, పచ్చని వరిచేలు, అక్కడక్కడ నిండు చెరువులు – వెరసి – సుందరపాలెం. పోస్టాఫీసు, హైస్కూలు, ఆసుపత్రి, కరెంటాఫీసు, జి.టి. రోడ్డును కలిపే పక్కారోడ్డు, నాలుగొందల యిళ్ళు – సినిమా, రేడియో, సాహిత్యం, విజ్ఞానం, అంతర్జాతీయ రాజకీయాలు మొదలైన సమస్త విషయాలూ చర్చించగల వూరివాళ్ళూ – వీటన్నిటితో ‘ఆ కోస్తా ప్రాంతంలో పలువురు అనాధల మధ్య సనాధలా’ వెలుగుతోన్న గ్రామం సుందరపాలెం. మరి అన్ని గ్రామాలూ అనాధలయితే ఇదొక్కటే సనాధ ఎలా అయింది? దేవుడు దిగివచ్చి మంత్రం వేశాడా?!

దేవుడక్కర్లేదు. ఒఖ్ఖ మనిషి చాలు. ఆ మనిషి శ్రీరాములునాయుడు.

సన్నని వింటికొయ్యలా ఆరడుగుల పొడవు, దట్టమైన వంకీల జుట్టు, ఎట్టి పరిస్థితుల్లోనూ చెదరని చిరునవ్వు, చామనఛాయ, మల్లెపూవు లాంటి కంటిమెడ లాల్చీ ...

సామాన్య కుటుంబంలో పుట్టినా మేనమామ ప్రాపకంలో పట్నంలో చదివినవాడు. బి.ఎల్. చదువును సమాజసేవ కోసం మధ్యలో వదిలివేసినవాడు. కనీసం ఎమ్మెల్యేగా అయినా చేద్దామనుకునే మేనమామ యిష్టానికి వ్యతిరేకంగా ‘నాకు పదవులు వద్దు. గ్రామానికి ఏమైనా చెయ్యగలిగితే అదే పదివేలు’ అని భీష్మించినవాడు. శ్రీరామచంద్రుని సత్ప్రవర్తనను, మహాత్ముని బోధనలనూ జీర్ణించుకుని, వున్నత ఆదర్శాల నాయకత్వపు ప్రతీకగా నిలిచినవాడు.

పదిహేనేళ్ళక్రితం గ్రామంలో అడుగుపెట్టాడు. నిస్తేజంగా, నిర్వీర్యంగా, అనైక్యంగా వున్న గ్రామంలో కదలిక తెచ్చాడు. ముందు హేళనకు గురయ్యాడు. మెల్లగా అందరి విశ్వాసం చూరగొన్నాడు. ముందుగా హైస్కూలు తెచ్చాడు.

ఆ తరవాత చకచకా అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపట్టి, పూర్తి చేసి, వూరిని సనాథగా మలచాడు. ఊళ్ళో తగవులు గుడి మండపం దాటి కోర్టుకు వెళ్ళరాదన్న కట్టుబాటుకు వూరిని వొప్పించి, ఐక్యం చేసిన 'న్యాయకోవిదుడు.' ఊరిని ప్రభుత్వ వర్గాల ముద్దుబిడ్డగా మలచిన 'అపురూప మేధావి.'

*

ఇంతకూ ఈ 'యజ్ఞం' కథేమిటి?

ఓ చిన్న తగవు. అప్పుల తగవు. బడుగు బతుకులు చిదికిపోతే ఆనాడూ ఈనాడూ కూడా అన్ని పల్లెల్లోనూ వచ్చే తగవు. అప్పు తీసుకోవడం, తీర్చలేకపోవడం, తగాదా, పంచాయితీ, ఏళ్ళ తరబడి తీరని తగవు – ఆరోజున తగవు తీర్చే బాధ్యత సహజంగా శ్రీరాములునాయుడి మీద పడటం ...

అప్పు తీసుకున్నది అప్పల్రాముడు. మాలల్లో పెద్ద. బంధు బలగం వున్నవాడు. పంచాయితీ హరిజన మెంబరు. ''మాటకు నిలబడేవాడు మాలల్లో అతనొక్కడే'' అని వూరి జనంలో సదభిప్రాయం వున్నవాడు.

ఇచ్చినది గోపన్న. చితికిపోయిన షావుకార్లై, వ్యాపారంలో నష్టాలు, సొంతవాళ్ళ దగాలు వల్ల చితికిపోయి దాదాపు ఏకాకిగా మిగిలినవాడు.

బాకీ మొత్తం రెండువేలు. వడ్డీతో రెండువేల అయిదువందలు. అది అప్పల్రాముడు తీర్చలేకపోతున్నాడు. మూడేళ్ళ క్రితమే పంచాయితీకి ఎక్కవలసిన విషయం అది. శ్రీరాములునాయుడు పూనుకొని మధ్యస్థంతో సరిపెట్టాడు. వడ్డీరేటును ప్రభుత్వంవారు ప్రకటించిన రేటుకు కుదించాడు. కష్టమో నష్టమో దానికే తలవొగ్గాడు గోపన్న. తనకున్న రెండెకరాల ముప్ఫయి సెంట్లూ అమ్మితేగానీ బాకీ తీరదు గాబట్టి మరో మూడేళ్ళు గడువు కావాలన్నాడు అప్పల్రావుడు. మూడేళ్ళ తరవాత అయినా ఎలా తీరుస్తావన్నారు పెద్దమనుషులు. ఏది ఏమైనా గడువిచ్చి తీరాలన్నాడు శ్రీరాములు నాయుడు. ఇచ్చారు. అది రేపటితో ముగుస్తోంది ...

అంతిమ నిర్ణయం వెలువరించ వలసిన సమయం వచ్చేసింది.

*

గుడిమంటపంలో పంచాయితీ. ఊరు వూరంతా పోగుపడింది.

''నేను చితికిపోయాను. అయినా నాకున్న ప్రతి అప్పునూ అణాపైసలతో తీర్చాను. నేనిచ్చిన అప్పు మాత్రం తిరిగి రావడం లేదు. మీరంతా ఎంత యిప్పిస్తారో యిప్పించండి. అదే మహాప్రసాదమని పట్టుకుపోతాను. నెపం పెట్టను. కోర్టుకు వెళ్ళను,'' అంటాడు గోపన్న.

''ఏవయ్యా అప్పల్రావుడూ, ఏమంటావ్?'' అంటే అతను వులకడు, పలకడు. ఎవరు ఎన్ని చెప్పినా పెదవి విప్పడు. చివరకు ఓపిక నశించిన ఓ మధ్యరకపు పెద్దమనిషి ''గతిలేని మనుషులు తగవుకెళితే మతిలేని పెద్దలు తీర్చే వారా ... మూడేళ్ళుగా సాగుతోంది ... పెద్దమనుషులంతా ఆ మాలవెధవల్ని అమ్మా, బాబూ అని పిసకరిస్తారేగానీ – 'ఏరా ఎదవనాకొడుకుల్లారా – మీ బాబు సొమ్మా, తాత సొమ్మా ... తీసుకున్న సొమ్ముని యివ్వక ఎక్కడికి పోతార్రా ... తంతాం' అని అడగరేం, పోనీ 'మాకు చేతగాదయ్యా' అనైనా గోపన్నకు చెప్పరేం? మళ్ళా కోర్టులొద్దంటారు. కట్టుబడి అంటారు,'' అని ఝణాయిస్తాడు.

చిట్టచివరకి నోరు విప్పిన అప్పల్రావుడు, ''మాకున్న మడిసెక్క అమ్మించేసైనా అప్పు తీరుమానం సెయ్యాలని సబవోరికి వున్నట్టుంది. అదే నాయవనిపిస్తే ఆ నాయమే యిప్పించండి. నెత్తినెట్టుకుంటాను,'' అంటాడు. ''అయితే

యిది అప్పుగాదంటావా? తీర్చమనడం న్యాయంగాదంటావా?'' అని పెద్దలు రెట్టిస్తే, ''అవునో గాదో తవరే ఆలోసించి సెప్పాలి,'' అంటాడు.

'అలుగుటయే ఎరుంగని' శ్రీరాములునాయుడు కొంతసేపు ఆలోచించి, 'పెద్దమనసుతో', ''రావుడూ, తగవు తీరుస్తున్నాను. ఈనాటినుంచీ నువ్వు గోపన్నగారికి నయాపైసా బాకీ లేవు. గోపన్నగారూ – ఎల్లుండి కనబడండి. నోటు చెల్లబెడతాను,'' అంటాడు 'శాంతంగా'.

ఇంకేం .. తగవు తీరినట్టేగదా – 'శ్రీరామచంద్రుడంత వుదాత్తంగానూ', 'గాంధీగారంత న్యాయంగానూ' తీర్పు చెప్పాడుగదా ..

మరి యింకా ముందుకు నడిచి ఒక హింసతోనూ, ఒక హత్యతోనూ, ఒక చావుతోనూ, ఒక కట్టుబాటు చెల్లా చెదరవడంతోనూ, ఒక వ్యవస్థ బీటలువారడంతోనూ ఎందుకు ముగిసినట్టూ?

*

అసలు కథ అప్పుడే మొదలయింది గాబట్టి .. కథను శ్రీరాములునాయుడు భుజాల మీంచి దించి అప్ప్రలా వుడు తన భుజాల మీద వేసుకున్నాడు గాబట్టి .. చివరికది అప్ప్రలావుడు కొడుకు సీతారావుడి చేతుల్లోకి వెళ్ళి ఒక తలా – ఒక మొండెంగా మిగిలింది గాబట్టి ..

శ్రీరాములునాయుడు తీరుమానం వెనక అలక, ఆగ్రహం వున్నాయని ఎత్తి చూపుతూ, అందుకు కారణాలు చెప్పమని నిలదీస్తాడు అప్ప్రలావుడు. అంతేగాకుండా 'నువు తగిలినసోట కనబడని దెబ్బలు తీస్తున్నా'వంటాడు. 'సాప కింద నీరులా సల్లగా ముంచుతున్నా'వంటాడు. 'నా ఏలితో నా కన్నే పొడుస్తున్నా'వంటాడు. ''నువు చెప్పిన తీర్పు నాయవైనదేనా .. అసలు నాది అప్పేనా?'' అని నిలదీస్తాడు. అప్పటిదాకా శ్రీరాములునాయుడ్ని అంతమాటలు అన్నవారు లేరు.

అరుదైన వుద్రేకానికి గురి అయిన శ్రీరాములునాయుడు, ''ఇది అప్పే! అప్పే!! అప్పే!!!'' అని ముమ్మారు ప్రకటిస్తాడు. ''అసలిది అప్పుగాదని ఎవరైనా ఎలా అంటారో నాకు బోధ పడటం లేదు'' అంటాడు.

''అవునవును. గడువిప్పించమంటే ఇప్పించగలడు గానీ అసలప్పే లేదనమంటే అనగలడా ఎంత దరమరాజు అయినా'' అంటాడో పెద్దమనిషి.

అప్ప్రలాముడి మడిసెక్క అమ్మి గోపన్న అప్పు తీర్చడానికి రంగం సిద్ధమవుతుంది.

''శ్రీరావులుబాబూ నీకూ నిజం తెలిసుండదన్న సంగతి నాకు తెలిసింది గాదు. ఇది నాయవైన అప్పు గాదని ఎందుకన్నానో, నాకు అప్పు ఎగవేద్దామన్న దుర్బుద్ధి ఎప్పుడు, ఎందుకు, ఎలా పుట్టిందో ఆ కథంతా తవరికి సెప్పి నా పొలం అమ్మకం కాయితాల మీద ఏలుముద్ర పెడతాను'' అంటాడు. అని మొదలెడతాడు అప్ప్రలావుడు.

యాభై యేళ్ళనాడు – అంటే 1913లో – తనూ, తన తమ్ముడూ ఆరారు ఎకరాలకూ, రెండేసి వీశెల వెండి బంగారాలకూ, చిన్న కొంపకూ వారసులవడం; ఆనాడు వూళ్ళో అందరికీ అంతో యింతో సెక్కముక్క వుండటం; ఆడంగులు రెండేసి యీసెల ఎండి మోయడం; సరిపడా తిండిగింజలు పండించుకోవడం; గోచిముక్కకు తడువు కోకుండా వుండటం .. రూపాయలు గాకుండా దినుసుల్ని యిచ్చిపుచ్చుకోవడం .. అందులో దగాలు .. పిచ్చికుంచాలు .. వర్తకధర్మాలు .. అయినా రైతులు షావుకార్లకు మదుపు పెట్టే స్థితిలో వుండటం .. షావుకార్లు ఎంత తిన్నా రైతులకు ఎంతో కొంత గిట్టుబాటవడం.

.. మెల్లగా పొగాకు, వేరుసెనగ లాంటి వర్తకప్పంటలు రావడం, సీమనూలు తాకిడికి మగ్గాలు మూత పెట్టిన సాలెవాళ్ళు మెల్లగా పంటల వర్తకాల్లో దిగడం, సావుకార్లవడం, రైతులకు ధరలు ఎప్పుడు ఎందుకు పెరుగుతాయో, పడిపోతాయో తెలియకపోవడం, కింద వున్న షావుకార్లు పైకి లేవగా పైన వున్న రైతులు దిగజారిపోవడం ..

.. వ్యాపారప్పంటల్లో కలిసి వేలుపెట్టిన గోపన్నా, తనూ అయిదేళ్ళు కలసికట్టుగా పైకి లెగవడం, ఆ తర్వాత గోపన్న పైకీ, తాను కిందకీ చేరుకున్న వైనం, తొమ్మిదెకరాలయిన తన ఆరు ఎకరాల పొలం రెండెకరాల చిల్లరకు తగ్గి పోవడం, ఎండి బంగారాలు ముండమోయడం, మాలలేగాకుండా గొల్లలూ, కొందరు కొందరు కాపులూ ఈ సుడి గుండంలో పడి మునిగిపోవడం ..

.. సావుకోర్ల రుణవెట్టిదో తెలిసీ రైతోడు సేజేతులా ఎల్లెల్లి ఆరి వలల్లో చిక్కుకోవడం, షావుకోర్లది తెలియక సేసిన పాపమే అయినా అది వూరంతటినీ సుట్టెయ్యడం, రైతులతోపాటు సావుకోర్లూ మునిగిపోవడం, వూళ్ళో వర్తకుల్ని బయటి వర్తకులూ, వాళ్ళను యింకా పెద్ద వర్తకులూ ముంచీసీయడం – ''ఇదంతా నరుడు తెస్తున్న ముప్పొ; నారాయనుడు బెడుతున్న సిక్కా'' అన్న మీమాంస .. అన్నీ చెప్పుకొస్తాడు అప్పలరావుడు.

చెప్పాక పదిహేనేళ్ళ క్రితం శ్రీరాములునాయడు వూళ్ళోకి అడుగు పెట్టినప్పుడు 'యింత కాలానికి పేదోల్ల సీకటి బతుక్కి దరమరాజు వచ్చాడని' సంబరపడటం గురించి చెబుతాడు. హైస్కూలూ, రోడ్డూ, కోపరేటివ్ గోడౌన్లూ, నూతులు తవ్వడం – పేదోళ్ళకి కొంతకాలం పని పుట్టించినా – కొత్త పనులు లేక ఎక్కడేసిన గొంగళి అక్కడే వుండటం గురించి చెబుతాడు.

ఇంటిల్లపాదీ పాటుపడినా తమకు గంజిమెతుకులు కరువవడం, పొట్టలు గడవకపోగా రుణాలు మిగిపోవడం – అటు ఏవీ లేనోళ్ళు ఏడాత్తిరిగేలోగా కావందులవడం చెప్పి, ''ఎవరి సొమ్ము ఎవరు పడేసుకోడం వల్ల గొప్పోల్లయి పోతున్నారో, ఎవరికెందువల్ల కూడు బుట్టకుండా పోతున్నదో మీరే (*ఆ ఇవరం*) సెప్పండి,'' అని అడుగుతాడు.

ఆ ప్రశ్న సంధించాక గతరాత్రి 'ఇంటికాడ సిన్న తగువయింద'ని చెపుతాడు. కొడుకు సీతారావుడు భూవి అమ్మడానికి ససేమిరా అంటున్నాడని చెపుతాడు. శ్రీరాములునాయుడుగారి వుపకారాలన్నీ బీదల కొంపల్ని ఎలా ముంచేసినాయని చెప్పారో చెబుతాడు. రోడ్డొచ్చి బళ్ళవాళ్ళనీ, కరెంటు వచ్చి ఏతాలు తోడేవాళ్ళనీ, రైసు మిల్లొచ్చి దంపుళ్ళవాళ్ళనీ దెబ్బగొట్టడం చెపుతాడు. ఊరు బాగుకోసం విరాళాలు, భూవులు యిచ్చిన కామందులు బాగుపడటం, శ్రమదానం చేసిన బీదా బిక్కీకి కూలి కూడా దొరకని పరిస్థితి ఏర్పడటం గురించి చెబుతాడు. శ్రీరాములునాయుడుగారి పుణ్యమా అని ఒకప్పుడు దివాలా తీసిన షావుకార్ల బిడ్డలంతా యిప్పుడు మల్లా పూటుకుంటున్న వైనం చెబుతాడు. పున్నానికొచ్చిన వోరిని శ్రీరాములునాయుడు మొదలెట్టిన యెగ్గెం ఎలా పాపంలో దింపిందో చెబుతాడు. ''బూవినమ్మితే నిన్ను నరికి నన్ను నేను నరుక్కు చస్తాను'' అన్న సీతారావుడి గురించి చెబుతాడు.

ఇవన్నీ చెప్పి తలెత్తి శ్రీరాములునాయుడి వంక చూస్తాడు. ఒక క్షణమంటే ఒక్క క్షణమే అప్పలరావుడిలో ఆశ కొట్టాడుతుంది. వెంటనే తనది అడియాస అని తేలిపోతుంది.

వేలిముద్ర వేస్తాడు.

'మురుగునీరు కన్నా హీనమైన' జనం సానుభూతి యిప్పుడు అప్పలరావుడికేసి ప్రవహిస్తుంది. 'దేనికా ప్రవాహం?'

ఈలోగా సీతారావుడు 'దడదడ నాలుగడుగులేసి పేటకేసి పరుగు పుచ్చుకుంటాడు.' అప్పటికిగానీ శ్రీరాములునాయుడు అక్కడేదో జరగబోతోందని గ్రహించడు. గ్రహించాక చిరునవ్వుల మొహంలో చీకట్లు .. గజగజ వణుకు .. ఆ ధీరోదాత్తుడిలో మార్పు చూసి జనంలో భయం ..

తిరిగొచ్చిన సీతారావుడి భుజాన వున్న గోనె మూటలో ఒక తల, ఒక మొండెం – సీతారావుడి కొడుకువి.

జనం మెప్పు కోరే అప్పల్రావుడ్నీ, తనును ఏలే దొరలు – కరణమూ మునసబులని తెలుసుకోలేని యెర్రిపీరు – శ్రీరాములునాయుడినీ ఎండగడతాడు సీతారావుడు. ఎండగట్టి మునసబుకో సవాలు విసురుతాడు: ''మున సబ్బాబూ, మంటపం తెరిచిన రోజున వూళ్ళో తగాదా వూళ్ళోనే వుండాలని నువ్వూ అన్నావు. ఇప్పుడు చెప్పు – అచ్చు రిపోర్టుకొస్తావా, నా కూనీ మాఫీ సేస్తావా?''

ఈ ప్రశ్నకూ, యిలాంటి లక్షలాది ప్రశ్నలకూ అప్పటికీ, యిప్పటికీ, ఎప్పటికీ ఈ వ్యవస్థ సమాధానం చెప్ప లేదు. చెప్పదు. చెప్పగల సామర్థ్యం లేదు.

''ధర్మపన్నాలెంత వరకూ? .. అంతా నువ్ చెప్పినట్టు వినేవరకూ'' అన్న వ్యాఖ్యతో 'యజ్ఞం' ముగుస్తుంది.

*

కథనం అతిసరళం. భాష చాలా సహజం. రక్తమాంసాలున్న పాత్రలు. 'మన వూళ్ళో జరిగినట్టుందే' అన్నంత సహజమైన కథామంటప వేదిక.

వస్తువు? భగవంతుడికి కూడా ఒక పట్టాన అర్థం కానంత అతి క్లిష్టమైనది.

పాఠకులను వుద్దేశ్యపూర్వకంగా 'తప్పుదారి' పట్టించి, రామరాజ్యపు సౌరభాలను చూపించి, గాంధీ మహాత్ముడు కలలుగన్న మరోప్రపంచపు పొలిమేరకు చేర్చి, ఓ తాడూ, బొంగరం లేని వూరు ఒకే ఒక వ్యక్తి పూనికతో అభివృద్ధి పథంలో జైత్రయాత్ర సాగించి ఆదర్శ గ్రామంగా ఎలా ఎదగగలదో చూపించి .. నిరూపించి ..

అలా వూహల వుయ్యాలలలో ఇల మరచిపోతోన్న పాఠకులు ఒక్కసారిగా వులిక్కిపడేలా చేసి, వారి గుండెల మీద వెయ్యి సమ్మెట పోట్లు పెట్టి, గత నలభై యాభై యేళ్ళుగా ఆ పోట్లు యింకా సలుపుతుండేలా చెయ్యడం ఎవరికన్నా సాధ్యమా? పరిసరాల్లోని పరిణామాలను పరిశీలించి, వాటిలోని విపరీత లక్షణాలను గ్రహించి, ఆ గ్రహింపు తనలోని ఏదో చైతన్యాన్ని మేలుకొలపగా, అందులోంచి ఒక సంవేదన కలగగా, ఏదో ఒక సంఘటన ఒక ట్రిగ్గర్ కాగా – తన పరిశీలనకు శాస్త్రీయ సామాజిక అవగాహనను జోడించి, సమస్యల మూలాలను వస్తునిష్టతో శోధించి; వాటన్నిటినీ వాస్తవానికి దగ్గరగా, సజీవ పాత్రలతో, నిజ జీవిత సంఘటనలతో, తమదైన అరుదైన సృజనతో అక్షర రూపంలోకి తీసుకు వస్తే 'యజ్ఞం' లాంటి పుట్టుకథలు వస్తాయి. సమ్మెట పోట్లను వెంట తీసుకు వస్తాయి.

ఈ అప్రయత్న ప్రయత్నం 'ఆరు సారా కథ'ల్లో కనిపిస్తుంది. ఖాళీ సీసాల స్మైల్‌లో కనిపిస్తుంది. ఇంకోరకంగా పద్మరాజు 'గాలివాన'లోనూ, బుచ్చిబాబు 'నా గురించి కథ రాయవూ?'లోనూ కనిపిస్తుంది. కానీ 'యజ్ఞం'కు ఓ చారిత్రక ప్రాముఖ్యం వుంది.

''ఒకప్పుడు తెలుగు కథ వ్యక్తుల అంతరంగ జీవనాన్ని కేంద్రంగా చేసుకుని సాగింది. ఇప్పుడు వ్యవస్థాగత జీవన చిత్రణ ముఖ్యపాత్ర వహిస్తోంది. వ్యక్తి – సమాజం – వ్యవస్థల మధ్య వున్న పరస్పర సంబంధాల చిత్రణ జరుగు తోంది. బహుశా ఈ షిఫ్ట్ 'యజ్ఞం' కథతో మొదలయిందనుకుంటాను. అందుకే ఆ కథకు ఒక వునికి వచ్చింది. దోపిడీని

బలంగా సాహిత్యపు ఎజెండాలోకి తీసుకువచ్చిన కథ 'యజ్ఞం'' అన్నారు 1997లో ఒక ఇంటర్వ్యూలో కాళీపట్నం రామారావు.

*

అంతా బాగుందిగానీ ఒకటి రెండు మాటలు.

'యజ్ఞం' కథలో వ్యవస్థ దుర్మార్గాన్ని (తానూ అంతకు ముందురాత్రే తెలుసుకున్న) అప్పల్రావుడితో 'అద్భుతంగా' చెప్పిస్తారు రచయిత. ఆ తరవాత సీతారావుడితో ముక్తాయింపు పలికిస్తారు. అతనితో వ్యవస్థను ఛాలెంజ్ చేయిస్తారు (రిపోర్టు రాస్తావా – ఖూనీ మాఫీ చేస్తావా మునసబ్బాబూ..).

కొమ్ములు తిరిగిన ఆర్థికవేత్తలు కూడా గ్రహించలేని వ్యవస్థాగత పద్మవ్యూహ దుర్మార్గాలను (అరుదుగా అమర్త్యసేన్, నామ్‌ఛోమ్‌స్కీలు గ్రహించి విప్పి చెప్పగలుగుతున్నారు) కథలో అరటిపండు వలచినంత సులభంగా అప్పల్రాముడు వివరించాడు. ఆర్థికవేత్తలకు సైతం ఆయా లోతులు అందకపోవడానికి కారణం బహుశా అందుకు మేధోసంపత్తి, విషయ పరిజ్ఞానమూ, ప్రపంచ జ్ఞానమూ మాత్రమే కాకుండా బడుగులలో సంవేదన, పేదలంటే సమానుభూతి కూడా అవసరం అవడం కావచ్చు. ఈ నేపథ్యంలో అంత క్లిష్టమయిన విషయాలు రాత్రికి రాత్రి అప్పల్రాముడి అవగాహనా పరిధిలోకి ఎలా చేరాయి? ఈ అవగాహనకు దోహదం చేసిన సీతారావుడు, ఎర్రయ్యలకు మాత్రం అంత విచక్షణ ఎలా సమకూరింది?

అలాగే కథ చిట్టచివర శ్రీరాములునాయుడును 'ఏలేది' కరణమూ మునసబులన్న సంగతి సీతారావుడు ఎత్తి చూపుతాడు. ఆ ఏలే ప్రక్రియను సూచనప్రాయంగానయినా కథలో ముందుగా చిత్రించి వుంటే సీతారాముడి నిర్ధారణకూ, వాస్తవానికీ మరింత బలం చేకూర్చినట్టుండేది. కరణం, మునసబులు దాదాపు 'మౌన' పాత్రలు.

ఇవి కథలో లోపాలా? తెలియదు. లోపాలు ఎన్నేంత స్థోమత నాకు లేదు. కానీ ఈ వ్యాసం సందర్భంగా కథను ఒకటికి పదిసార్లు చదివినపుడు ఆ పదిసార్లూ ఇవే సందేహ భావాలు! అంచేత చెప్పక తప్పడం లేదు.

సీతారావుడు తన కొడుకును తెగనరకడం గురించి యిప్పటికే ఎంతో చర్చ జరిగింది. జరుగుతోంది. అందులోకి నేను వెళ్ళను. కానీ ఒక్క మాట – ముఖ్య వుద్దేశ్యం అది కాకపోవచ్చు కానీ ఆ సంఘటన వ్యవస్థ కాలరు పుచ్చుకుని నిలదీయడానికి బలంగా వుపయోగపడింది (రిపోర్టా – మాఫీనా). ఆ సవాలును స్వీకరించి జవాబు యివ్వడానికి అప్పటికీ యిప్పటికీ వ్యవస్థ సంసిద్ధంగా లేదు.

శ్రీరాములునాయుడు, అప్పల్రావుడు, సీతారావుడు, గోపన్న, మునసబు, కరణం, గుడిమండపం, హైస్కూలు, రోడ్డు – యివి అసలు పాత్రలూ స్థలాలే కాదు; అవి యింకా వున్నతమైన ప్రతీకలు అని తాత్విక ధోరణిలో కథను 'వున్నతీకరించ' వచ్చు. నేనాపని పెట్టుకోను. మనం అంత దూరం వెళ్ళనవసరం లేదు. కథను వున్నది వున్నట్టుగా మన ఆలోచనల్లో, అనుభవాలలో, సంస్కారంలో, విజ్ఞానంలో ఒక భాగంగా చేసుకోగలిగితే మనల్ని మనం ఎంతెంతో వున్నతీకరించుకుంటాం!

*

చట్టం, న్యాయం, ధర్మం, నీతి అన్న అంశాల మూలాలలోకి వెళ్ళి పరిశీలించి ప్రశ్నించిన కథ 'యజ్ఞం'. పద్మవ్యూహ సదృశమయిన వ్యవస్థ స్వరూపాన్ని నగ్నంగా, సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా విప్పి చెప్పిన కథ 'యజ్ఞం'.

ప్రపంచంలో ఏడే ఏడు కథలు వున్నాయనీ, మిగిలిన ఏడు మిలియన్ల కథలూ – రామాయణ భారతాలు, ఇలియడ్ ఒడెస్సీలతో సహా – వాటి ప్రతిరూపాలు అన్న సర్వజన అంగీకార సాహిత్య భావన బాగా ప్రచారంలో వుంది. అది నిజమే అయితే ఆ ఏడింటికీ మరొకటి తప్పక జోడించవలసిన అవసరాన్ని కల్పించిన ఎనిమిదో కథ 'యజ్ఞం'.

***